



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 293 | ఆదివారం 10 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నేడు ప్రధాని మోడీ హైదరాబాద్ రాక

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

హైదరాబాద్ - సూర్య వాస్తవం



నేడు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ సందర్భంగా రూ.9,400 కోట్లకు పైగా విలువైన అభివద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేయనున్నారు. మధ్యాహ్నం 1.10 గంటలకు బెంగుళూరు విమానాశ్రయం నుంచి బయలు దేరి 2.20 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 2.30 గంటలకు అక్కడి నుంచే పలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

- మిగతా 2లో..

# 120 సీట్ల బలంతో విజయ్.. ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్

- నేడు తమిళనాడు సీఎంగా ప్రమాణం
- మరో తొమ్మిది మంది మంత్రులు కూడా
- 13న విశ్వాస పరీక్ష 120 మంది మద్దతుతో గవర్నర్ అంగీకారం
- మా పథకాలను కొనసాగించండి : స్టాలిన్



చెన్నై - సూర్య వాస్తవం

ఎట్టకేలకు అన్ని రకాల అడ్డంకులు, అనిశ్చితులు తొలగి తమిళనాడు ముఖ్యమంత్రిగా నటుడు, టీవీకే అధ్యక్షులు సి.జోసెఫ్ విజయ్ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 9మంది మంత్రులుగా ప్రమాణం చేస్తారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. అనంతరం ఈ నెల 13లోగా అసెంబ్లీ వేదికగా విశ్వాస పరీక్ష జరగనుంది. గత కొన్ని రోజులుగా తమిళనాడులో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి దీంతో తెర పడింది. గత నాలుగు రోజులుగా వరుసగా నాలుగుసార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్ శనివారం సాయంత్రానికి గ్రీన్ సిగల్ లభించింది. 234మంది సభ్యులు గల సభలో తనకు 120మంది సభ్యుల మద్దతు ఉందని పేర్కొంటూ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిదిగా

- మిగతా 2లో..



## బీజేపీ అబద్ధాలతో దేశ యువత విసిగిపోయింది

**- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

బీహార్‌లో నిరుద్యోగ యువత సమస్యల్ని బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం పాట్నాలో ఉపాధ్యాయ అభ్యర్థులు శాంతి యుతంగా తమ ఉద్యోగాల కోసం నిరసన చేస్తుండగా.. పోలీసులు వారిపై లాఠీ ఛార్జీ చేశారు. ఈ చర్యను రాహుల్ తీవ్రంగా

- మిగతా 2లో..

## పట్టణీకరణతో భవిష్యత్ లో మరిన్ని సవాళ్లు

- మూసీ పునరుజ్జీవం రాష్ట్ర ప్రగతికి దిక్సూచి
- అధిగమించే ప్రణాళికల అమలే లక్ష్యం
- సిగల్ ఫ్రీ సిటీగా హైదారాబాద్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ
- సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్- సూర్య వాస్తవం

ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్, సిగల్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దానికోసం అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే మూడు స్థాయిల విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదనీ, మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలనీ, పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు సిటీలో మల్టీ లెవెల్ పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

శనివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పార్లమెంటరీ

- మిగతా 2లో..

## దేవుడు కూడా మద్యం తాగుతాడు

- మద్యం సేవించడం పట్ల నాకు అభ్యంతరం లేదు
- కానీ అది వ్యసనంగా మారకూడదు : కర్మాటక సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు - సూర్య వాస్తవం

ఈ రోజుల్లో చాలామంది మద్యం తాగుతున్నారు. దేవుళ్ళు కూడా మద్యం సేవించారు. నా మంత్రివర్గంలోని చాలామంది మంత్రులు కూడా తాగుతారు. నేను మద్యం సేవించడానికి వ్యతిరేకం కాదు. కానీ అది ఎన్నడూ వ్యసనంగా మారకూడదు," అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అన్నారు. నగరంలోని అలీ అస్కార్ రోడ్డులో నిర్మించిన 'సహకార సమృద్ధి సౌధ', సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయపు కొత్త పరిపాలనా భవనం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామాల నుంచి పాలు నగరాలకు వస్తాయని, కానీ నగరాల నుంచి విస్కీ, బ్రాందీ వంటి మద్యం

- మిగతా 2లో..



## అగ్ని క్షిపణి అడ్వాన్స్‌డ్ వేరియంట్‌ను పరీక్షించిన భారత్ !

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- ప్రధాని మోదీ పర్యటన ట్రయల్ రన్‌తో ఇబ్బందులు
- బంజారాహిల్స్‌లో 10 నిమిషాలు ఆగిన కాన్వాయ్
- ట్రాఫిక్ కారణంగా కారు నుంచి కిందకు దిగిన ముఖ్యమంత్రి
- సమాచార లోపమే కారణమని వెల్లడి

హైదరాబాద్- సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కాన్వాయ్‌తో హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న ట్రయల్ రన్ కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు బంజారాహిల్స్ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ చేపట్టారు. అయితే, కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ అటువైపుగా వచ్చింది. దీంతో ఆయన వాహనశ్రేణి ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడి, సుమారు 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే నెమ్మదిగా కదులుతూ



## మనందరి మొదటి శత్రువు బీజేపీయే.. కలిసి పోరాడుదాం

- మమతా బెనర్జీ పిలుపు
- విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా మద్దతివ్వాలని విజ్ఞప్తి
- వామపక్షాలు, ప్రతిపక్షాలు కలిసి రావాలన్న మమతా బెనర్జీ
- బీజేపీ వంటి దుష్ట శక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని ఆగ్రహం

2లో

## నోటీసు ఇచ్చాకే ఆక్రమణలను తొలగించాలి

**- అసాధారణ పరిస్థితుల్లోనే నోటీసు ఇవ్వక్కర్లేదు : హైకోర్టు తీర్పు**

2లో



## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణం

- హాజరైన ప్రధాని మోడీ,
- ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు

కోల్‌కతా - సూర్య వాస్తవం

బెంగాల్‌లో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా శనివారం సువేందు అధికారి ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. 1971 తర్వాత కలకత్తాయేతర జిల్లా నుంచి సీఎం పదవి చేపట్టిన మొదటి వ్యక్తిగా సువేందు అధికారి నిలిచారు. ఒకప్పుడు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడిగా ఉన్న సువేందు ఇప్పుడు ఆమెనే ఓడించి

- మిగతా 2లో..

## నేడు ప్రధాని మోడీ
# హైదరాబాద్ రాక

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత హెలికాప్టర్‌లో హైటెక్ సిటీకి వెళ్తారు. 3.45గంటలకు సాయి సింధు క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత 6.45 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి గుజరాత్‌లోని జామ్ నగర్‌కు తిరిగి వెళ్తారు.

**అభివృద్ధి కార్యక్రమాలు**

-రూ.3,175 కోట్లతో చేపట్టనున్న (గూడెబెల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు) జాతీయ రహదారి-167కు శంకుస్థాపన చేస్తారు

-రూ.2,350 కోట్లతో 3,245 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన చేస్తారు

-రూ.1,700 కోట్లతో ఏర్పాటు చేసిన వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం చేస్తారు.

-రూ. 1,535 కోట్ల విలువైన కాజీపేట-విజయవాడ మల్టి ట్రాకింగ్‌తో పాటు పలు కీలక రైల్వే ప్రాజెక్ట్‌లను ప్రారంభిస్తారు.

-రూ.600 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అభివద్ధి చేసిన మల్కాపూర్ టెర్మినల్‌ను జాతికి అంకితం చేస్తారు.

## బీజేపీ అబద్ధాలతో దేశ
# యువత విసిగిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. 'నిన్న పాట్నాలో టీచర్ అభ్యర్థులు తమ ఉద్యోగ హక్కు కోసం శాంతియుతంగా నిరసన చేస్తుంటే బీహార్ పోలీసులు దారుణంగా వారిపై మరోసారి లాఠీఛార్జీ చేశారు. నిరుద్యోగ యువత గళమెత్తితే దానికి బిజెపి ప్రతిస్పందన వారిపై లాఠీలు ఝుళిపించడం. నేడు భారతదేశంలో నిరుద్యోగం అతిపెద్ద వ్యాధి. దీని అత్యంత వినాశకరమైన ప్రభావం బీహార్, ఉత్తరప్రదేశ్ యూత్‌పై పడుతోంది' అని రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాహుల్ చెప్పారు. లక్షలాది మంది యువత డిగ్రీలు, తమకున్న నైపుణ్యాల్ని చేతపట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు. కానీ బిజెపి ప్రభుత్వం వారిని గానీ, మిమ్మల్ని గానీ పట్టించుకోదు. యువత తమ హక్కుల్ని డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చినప్పుడు వారికి ఉద్యోగాలివ్వడం లేదు. దానికిబదులుగా వారి వీపులపై లాఠీలను ఝుళిపిస్తున్నారు. బిజెపి అబద్ధాలతో భారత యువత విసిగిపోయింది. వారు ఇకపై మౌనంగా ఉండరు. కాంగ్రెస్ ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలుస్తుంది.

## దేవుడు కూడా
# మద్యం తాగుతాడు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలకు వెళ్తుందని ఒకప్పుడు పార్లమెంటులో చర్చ జరిగిందని ఆయన గుర్తుచేసుకున్నారు. "ఈ రోజుల్లో చాలా మంది మద్యం తాగుతున్నారు. దేవుళ్ళు కూడా మద్యం సేవించారు. నా మంత్రివర్గంలోని చాలా మంది మంత్రులు కూడా తాగుతారు," అని మాజీ మంత్రి ఆర్.ఎల్. జలప్ప మద్యం సేవించని వారిని, "నువ్వెందుకు పుట్టావు?" అని ఎగతాళి చేసేవారని గుర్తుచేసుకుంటూ ఆయన అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు, "మద్యపానం చేయడంలో తప్పు ఏమీ లేదు. కానీ అది వ్యసనంగా మారకూడదు."

## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న
# చంద్రబాబు కాన్వాయ్

(మొదటి పేజీ తరువాయి)

ఉండిపోయింది.

ట్రాఫిక్ జామ్ తీవ్రంగా ఉండటంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు తన కారు నుంచి కిందకు దిగారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటి తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో చంద్రబాబు కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు కదిలి వెళ్లిపోయింది. ఉన్నతాధికారుల మధ్య సమాచార లోపం వల్లే ఈ గందరగోళం తలెత్తినట్లు తెలుస్తోంది.

# అగ్ని క్షిపణి అడ్వాన్స్‌డ్ వేరియంట్‌ను పరీక్షించిన భారత్ !

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఆధునీకరించిన అగ్ని క్షిపణిని భారత్ శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. ఒరిస్సాలోని అబ్దుల్ కలామ్ ఐల్యాండ్ నుండి మల్టిపుల్ ఇండిపెండెంట్‌లీ టార్గెట్‌బుల్ (బహుళ స్వతంత్ర లక్ష్యాలు కలిగిన) రీ ఎంట్రీ వెహికల్ (ఎంఐఆర్‌వి) తో ఈ పరీక్షను చేపట్టారు. ఒకే క్షిపణి ద్వారా వేర్వేరు ప్రదేశాల్లో బహుళ వార్ హెడ్‌లను ప్రయోగించగలిగేందుకు ఈ ఎంఐఆర్‌వి అవకాశం కల్పిస్తుంది. ఈ క్షిపణి వ్యవస్థను శుక్రవారం పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో విస్తారమైన ఏరియాలో వేర్వేరు చోట్ల వివిధ లక్ష్యాలను లక్ష్యంగా చేసుకుని పలు పేలోడ్‌లతో ఈ క్షిపణిని పరీక్షించినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

## బెంగాల్ సీఎంగా
# సువేందు అధికారి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం పగ్గాలు చేపట్టడం గమనార్హం. బీజేపీ శాసనసభ్యులు దిలీప్ ఘోశ్, అగ్నిమిత్రా పాల్, అశోక్ కీర్తనియా, నితీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ అమిత్ షా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడు సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో పాటు ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు పాల్గొన్నారు.

## 120 సీట్ల బలంతో విజయ్..
# ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ ఆర్లేకర్‌ను విజయ్ కోరారు. దాంతో రాజ్యాంగంలోని 164వ సెక్షన్ కింద ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించిన టీవీకే చీఫ్ విజయ్ ను చీఫ్ మినిస్టర్ డిజిగేట్‌గా గవర్నర్ నియమించారు. టీవీకేకు బేషరతుగా మద్దతునిస్తున్నామని వీసీకే, ఐయూఎంఎల్ ప్రకటించిన అనంతరం విజయ్, గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఆ సమయంలో ఆయన వెంట కాంగ్రెస్, వీసీకే, సీపీఐ(ఎం), సీపీఐ, ఐయూఎంఎల్ నేతలు ఉన్నారు. ప్రస్తుతం పార్టీల బలాబలాలు : టీవీకే (108), కాంగ్రెస్ (5), సీపీఐ(ఎం) (2), సీపీఐ(2), వీసీకే(2), ఐయూఎంఎల్(2) మద్దతు ప్రకటించాయి. విజయ్ రెండు స్థానాల్లో గెలుపొందడంతో ఒక ఓటే వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో, విజయ్‌ను బలపరుస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య 120గా ఉంది.

**టీవీకే హెడ్‌క్వార్టర్స్‌లో సంబురాలు**

తమ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం కాగానే పెద్ద సంఖ్యలో టీవీకే కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు పార్టీ హెడ్‌క్వార్టర్స్ బయట బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. లోక్‌భవన్‌కు వెళ్లినపుడు తమ నేతను చూసేందుకు అక్కడ కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు.

**డీఎంకే పథకాలను కొనసాగించండి : స్టాలిన్**

డీఎంకే ప్రభుత్వం ముందుచూపుతో, పక్కా ప్రణాళికగా అమలు చేసిన పథకాలను కొనసాగించాల్సిందిగా ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలుగుతున్న, డీఎంకే చీఫ్ ఎం.కె.స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. అవి కొనసాగిస్తే అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారని తెలిపారు.

**ఇంకా డీఎంకే కూటమిలోనే : వీసీకే చీఫ్**

టీవీకేకు మద్దతునందించిన అనంతరం వీసీకే చీఫ్ తిరుమవలవన్ మాట్లాడుతూ 108 స్థానాలు సాధించిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు తాము అడ్డంకి కారాదని భావించామని, రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించకుండా నివారించాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీఎంకే కూటమితో తమ పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఒక రాజకీయ పార్టీగా మాకున్న స్వతంత్ర హక్కును ఉపయోగించుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీనివల్ల డీఎంకేతో తమ సంబంధం దెబ్బతిన్నదన్నారు.

**లోక్‌భవన్‌కు వచ్చి తిరిగి వెళ్లిపోయి...**

వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు లభించిన అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరేందుకు విజరు లోక్‌భవన్‌కు వెళ్ళారు. అక్కడ ఆయనకు గవర్నర్ అపాయింట్‌మెంట్ లభించలేదు. దాంతో ఆయన వెనుదిరిగారు.

**గవర్నర్ తీరుపై ఆగ్రహం**

నాలుగు రోజుల పాటు అనిశ్చితి సష్టించిన గవర్నర్ ఎట్టకేలకు విజరు ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించాల్సి వచ్చింది. చట్టసభల్లో నిరూపించుకోవాల్సిన మెజారిటీ వివరాలను తనకు ముందే సమర్పించాలంటూ తాత్సారం చేయడంపై ఆగ్రహం వ్యక్తమైంది. దేశమంతటా రాజ్యాంగ నిపుణులు గవర్నర్ తీరును నిరసించారు. గత సాంప్రదాయాల ప్రకారం అత్యధిక స్థానాలు సాధించిన టివికెను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. విజయ్ మినహా ఎవరూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రాకపోయినా... చివరి నిమిషం వరకూ ఆయన సీఎం కాకుండా అడ్డుకోవడానికి గవర్నర్ అన్ని ప్రయత్నాలు చేయడం గమనార్హం. బీజేపీ రాజకీయ వ్యూహాలకు అనుగుణంగా గవర్నర్ వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మెజారిటీ కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చేందుకు ముందుకు రావడంతో ఆదివారం విజరు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## పట్టణీకరణతో భవిష్యత్‌లో
# మరిన్ని సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై చర్చించారు.

అంతకుముందు అధికారులు తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్లమెంటరీ స్టాండిగ్ కమిటీకి వివరించారు. ఆయా ప్రాజెక్టులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని కమిటీకి అధికారులు విజ్ఞప్తి చేశారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆసక్తి కనబర్చింది. ఇదో విప్లవాత్మక నిర్ణయమని కమిటీ చైర్‌పర్సన్ శ్రీనివాసులు రెడ్డి ప్రసంసించారు. ఒక నదిని పునరుజ్జీవం చేయడం దేశంలోనే మొదటిదని అభిప్రాయపడ్డారు. ఈ ప్రణాళికపై సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు. అలాగే రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలనూ కమిటీ సభ్యులు అభినం దించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ భాగాలుగా విభజించి, దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకు న్నామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ పనితీరును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీలు అలోక్‌శర్మ, కున్వర్ సింగ్ తన్వర్, లవ్లీ ఆనంద్, మహిమా కుమారి మేవార్, మాలా రాజ్యలక్ష్మిషా, గుమ్మ తనుజా రాణి, హిబి ఎడెన్, సంజరు దినాపాటిల్, రవీంద్రవైకర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి తదితరులు పాల్గొ న్నారు. అంతకుముందు సీఎం స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్‌తో పాటు సభ్యులను ఘనంగా సత్కరించారు. వారికి తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను అందజేశారు.

**'క్యూర్'లో సర్వీస్ సెక్టార్**

ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ఏరియాను 'క్యూర్'గా గుర్తించి, అక్కడ సర్వీస్ సెక్టార్‌ను అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) బయట, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) లోపల ఉన్న ప్రాంతాన్ని 'ప్యూర్'గా గుర్తించి మ్యాన్యుఫాక్చర్ సెక్టార్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ప్రాంతాన్ని 'రేర్'గా గుర్తించి అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించి, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించామన్నారు.

**మెట్రో రెండోదశను సిఫారసు చేయండి**

హైదరాబాద్ మెట్రోరైల్ (హెచ్ఎమ్ఆర్) రెండోదశ ప్రాజెక్ట్‌ను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హెచ్ఎమ్ఆర్ మొదటి దశ ప్రాజెక్ట్‌ను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి ప్రభుత్వం టేకోవర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో అమృత్ సిటీలు, స్మార్ట్ సిటీలుగా ఎంపికైన పట్టణాలకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నదనీ, దాన్ని నివారించాలని కోరారు.

**'మూసీ'తో సంస్కృతి అనుసంధానం**

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు తెలం గాణ సంస్కృతిని అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలి పారు. నగరంలో కాలుష్య నియంత్ర ణకు చర్యలు తీసుకుంటున్నామనీ, దానిలో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. 'క్యూర్' పరిధిలో ఆటోలకు ఉచి తంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఎలక్ట్రిక్ వాహనా లుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణ యించిందన్నారు. 'క్యూర్' పరిధిని ప్రణాళికాబద్దంగా అభివృద్ధి చేస్తూ, హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తామన్నారు.

## మనందరి మొదటి శత్రువు బీజేపీయే..
# కలిసి పోరాడుదాం

- మమతా బెనర్జీ పిలుపు
- విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా మద్దతివ్వాలని విజ్ఞప్తి
- వామపక్షాలు, ప్రతిపక్షాలు కలిసి రావాలన్న మమతా బెనర్జీ
- బీజేపీ వంటి దుష్ట శక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని ఆగ్రహం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

మనందరి మొదటి శత్రువు బీజేపీయేనని, కాబట్టి అందరం కలిసి ఆ పార్టీపై పోరాటం చేద్దామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. సువేందు అధికారి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఏకం కావాలని సూచించారు. విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా మద్దతివ్వాలని కోరారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే వామపక్షాలు, ప్రతిపక్షాలతో పాటు జాతీయ పార్టీలు కూడా కమలం పార్టీపై పోరాటానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. శత్రువుకు శత్రువు మిత్రుడు అని ఆలోచించే సమయం ఇది కాదని అన్నారు. మనందరి మొదటి శత్రువు బీజేపీయే అన్నారు. బీజేపీ వంటి దుష్ట శక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు తనతో మాట్లాడారని వెల్లడించారు. తాను ఎవరి సానుభూతిని కోరుకోవడం లేదని, యుద్ధంలో ఎవరు గెలుస్తారనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ పార్టీకి అన్యాయం జరిగిందని మమతా బెనర్జీ ఆరోపించారు.




# నోటీసు ఇచ్చాకే ఆక్రమణలను తొలగించాలి


## - అసాధారణ పరిస్థితుల్లోనే నోటీసు ఇవ్వక్కర్లేదు : హైకోర్టు తీర్పు

**అమరావతి - సూర్య వాస్తవం**

నోటీసు జారీ చేశాకే ఆక్రమణలను తొలగించాలని. అసాధారణ ప్రత్యేక పరిస్థితుల్లో నోటీసు ఇవ్వకుండా ఆక్రమణల తొలగింపు అధికారం అధికారులకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. అత్యవసర సందర్భంలో మాత్రమే నోటీసు ఇవ్వకుండా ఆక్రమణలను తొలగించేందుకు ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని సెక్షన్ 405 వెసులుబాటు కల్పిస్తోందని వివరించింది. ప్రత్యేక సందర్భంలో మాత్రమే సహజ న్యాయసూత్రాలను పాటించకుండా సెక్షన్ 405 అమలు అధికారం అధికారులకు ఉంటుందని చెప్పింది. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ముందస్తుగా నోటీసు ఇచ్చాకే కూల్చివేత చర్యలు ఉండాలంది. ఈ మేరకు జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న చౌక్‌లో రోడ్డుకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి రెండు షాపులు నిర్మించారని చెప్పి అధికారులు తనకు నోటీసు ఇవ్వకుండా తొలగింపు చర్యలు చేపట్టడాన్ని సవాలు చేస్తూ షాపుల యజమాని కె.శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు పైవిధంగా తీర్పు చెప్పింది. దుకాణాలు పిటిషనర్ స్వాధీనంలో చాలా కాలంగా ఉన్నాయని, పిటిషనర్‌కు నోటీసులు జారీ చేశాక తదుపరి చర్యలు ఉండాలని కడప మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

# సంపాదకీయం

## లాభాలు పండిస్తున్న యుద్ధం...




ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతుంటే, కొన్ని కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నాయి. యుద్ధం సృష్టించిన అనిశ్చితితో పాటు ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను మూసివేయడం వల్ల ప్రజల జీవన వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రభావం కంపెనీలు, కుటుంబాలు, ప్రభుత్వాల బడ్జెట్‌లపై తీవ్రంగా పడింది. ఇలా ఒకవైపు అనేకమంది ఆర్థికంగా కుదేలై దివాలా అంచున నిలబడితే, మరోవైపు యుద్ధ సమయాల్లో ఎక్కువ లాభాలు పొందే వ్యాపారాలు, అస్థిరమైన ఇంధన ధరల ద్వారా లబ్ధి పొందే మరికొన్ని సంస్థలు మాత్రం రికార్డు స్థాయిలో సంపాదనను కళ్ల చూస్తున్నాయి.ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటిదాకా కనిపించిన అతిపెద్ద ఆర్థిక ప్రభావం ఇంధన ధరల పెరుగుదలే.ప్రపంచంలోని చమురు, సహజ వాయువులలో దాదాపు ఐదో వంతు (20 శాతం) 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' ద్వారా రవాణా అవుతుంది. అయితే, ఫిబ్రవరి చివరి నాటికి ఈ రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఇంధన మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు ఒక 'రోలర్ కోస్టర్'లా మారిపోయాయి.ఈ పరిస్థితిని ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని భారీగా లాభపడ్డాయి. ప్రధానంగా ఐరోపాకు చెందిన దిగ్గజ చమురు సంస్థలు లబ్ధి పొందాయి.ఈ కంపెనీలకు సొంతంగా ట్రేడింగ్ విభాగాలు ఉండటంతో, మార్కెట్‌లో ధరల్లో వచ్చిన భారీ మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని లాభాలు పెంచుకోగలిగాయి.ముఖ్యంగా బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీ లాభాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే రెండింతలు పెరిగి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,230 కోట్లు)కు చేరుకున్నాయి. తన ట్రేడింగ్ విభాగం కనబరిచిన 'అసాధారణ' పనితీరు వల్లే ఈ స్థాయిలో లాభాలు వచ్చాయని సదరు కంపెనీ పేర్కొంది.షెల్ కంపెనీ తన మొదటి త్రైమాసిక లాభాలు 6.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.65,379 కోట్లు)కు పెరిగినట్లు నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయింది.మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'టోటల్ ఎనర్జీస్' చమురు, ఇంధన మార్కెట్లలోని హెచ్చుతగ్గుల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో తన లాభాలను దాదాపు మూడో వంతు పెంచుకుని, 5.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51,014 కోట్లు)కు చేరుకుంది.మధ్యప్రాచ్యంలో ఇంధన సరఫరాకు ఏర్పడిన ఆటంకాల కారణంగా అమెరికా దిగ్గజ సంస్థలు ఎక్సాన్ మొబిల్, షెవ్రాన్ ఆదాయాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తగ్గాయి.అయితే, ఈ రెండు కంపెనీలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే చమురు ధరలు ఇప్పటికీ గణనీయంగా ఎక్కువగానే ఉండటంతో, ఈ ఏడాది గడిచేకొద్దీ తమ లాభాలు మరింత పెరుగుతాయని అవి భావిస్తున్నాయి.కొన్ని అతిపెద్ద బ్యాంకులు కూడా ఇరాన్ యుద్ధ సమయంలో తమ లాభాలను భారీగా పెంచుకున్నాయి.జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం 2026 మొదటి మూడు నెలల్లో రికార్డు స్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1,09,585 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. ఇది ఆ బ్యాంక్ మొత్తం మీద తన చరిత్రలోనే రెండవ అతిపెద్ద త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంలో సహాయపడింది.అలాగే బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గో వంటి మిగిలిన 'బిగ్ సిక్స్' బ్యాంకులన్నీ కూడా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో గణనీయమైన లాభాలను సాధించాయి.మొత్తంగా, ఈ బ్యాంకులు 2026 మొదటి మూడు నెలల్లో 47.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4,50,621 కోట్లు) లాభాలను నివేదించాయి.భారీ స్థాయిలో జరిగిన ట్రేడింగ్ లావాదేవీలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు, ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ సంస్థలకు బాగా లబ్ధి చేకూర్చాయి" అని వెల్త్ క్లబ్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సుసానా స్ట్రీటర్ పేర్కొన్నారు.పెట్టుబడిదారులు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్స్, బాండ్లను వదిలించుకుని, సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి పోటీ పడటంతో ట్రేడింగ్‌కు పెరిగిన డిమాండ్ వాల్ స్ట్రీట్ రుణదాతలకు బాగా కలిసివచ్చింది.అలాగే, ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను సొమ్ము చేసుకోవాలని పెట్టుబడిదారులు ప్రయత్నించడం వల్ల కూడా ట్రేడింగ్ లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగింది."యుద్ధం వల్ల తలెత్తిన అస్థిరత ట్రేడింగ్ ఒక్కసారిగా పెరగడానికి కారణమైంది. పరిస్థితులు మరింత విషమిస్తాయన్న భయంతో కొందరు పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను విక్రయించగా, మరికొందరు తక్కువ ధరల్లో కొనుగోలు చేశారు. ఇది మార్కెట్ మళ్లీ పుంజుకోవడానికి దోహదపడింది" అని స్ట్రీటర్ విశ్లేషించారు.ఎఫ్-35 ఫైటర్ జెట్ భాగాల సహా వివిధ ఉత్పత్తులను తయారుచేసే బీఏఈ సిస్టమ్స్, ట్రేడింగ్ అప్‌డేట్‌లో ఈ ఏడాది అమ్మకాలు, లాభాల్లో బలమైన వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'రక్షణపరమైన ముప్పులు' ప్రభుత్వ రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయని, ఇది తమ కంపెనీకి 'అనుకూలమైన వాతావరణాన్ని' సృష్టించిందని ఆ సంస్థ పేర్కొంది.ప్రపంచంలోని అతిపెద్ద రక్షణ కాంట్రాక్టర్లలో మూడు సంస్థలైన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, నార్త్రోప్ గ్రూమ్మన్ 2026 మొదటి త్రైమాసికం చివరి నాటికి తమ వద్ద రికార్డు స్థాయిలో ఆర్డర్లు పేరుకుపోయినట్లు నివేదించాయి.అయితే, గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిన రక్షణ రంగ సంస్థల షేర్లు, మార్చి మధ్య కాలం నుంచి తగ్గుముఖం పట్టాయి. ఈ రంగంలోని షేర్ల విలువ వాస్తవ స్థాయి కంటే ఎక్కువగా ఉందనే ఆందోళనల మధ్య ఈ క్షీణత కనిపిస్తోంది.




# పొలిటికల్ గేమ్... షురూ...

## సీబీఐ భుజంపై రేవంత్ తుపాకి







**హైదరాబాద్-సూర్య వాస్తవం :** తెలంగాణలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇంకో రెండేళ్ల తర్వాత జరగబోయే ఎలక్షన్స్ కోసం ఇప్పటినుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి పార్టీలు. సీఎం రేవంత్ రెడ్డి అయితే..బీఆర్ఎస్, బీజేపీ కంటే ఓ అడుగు ముందుకేసి..నెక్స్ట్ లెవల్ ప్లానింగ్స్ చేస్తున్నారట. రాజకీయ ప్రత్యర్థులైన బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెప్పేందుకు ఒక దెబ్బకు రెండు పిట్టలు అనేలా పొలిటికల్ వెపన్స్ బయటికి తీస్తున్నారట. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అంటూ లేఖ రాసి..చర్చకు తెరలేపారు.తాము లేఖ రాసి నెలలు గడిచిపోతున్నా..ఇప్పటివరకు సీబీఐ నుంచి రెస్పాన్స్ లేదంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని బీఆర్ఎస్ తో కలుపుతూ విమర్శలు చేస్తున్నారు. లేటెస్ట్ గా తెలంగాణ సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే..కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐకి అప్పగించిన రేవంత్ సర్కార్.. విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలంటూ సీబీఐకి అప్పగించాలని డిసైడ్ అయ్యింది. దీనిపై త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి విచారణ కోరేందుకు సర్కార్ సిద్ధమవుతుండటం..తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తోంది రేవంత్ సర్కార్. గతంలోనే జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ వేసింది. అయితే విచారణ సమయంలో కమిషన్ ఛైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా..పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లడంతో..ఆయనను తప్పించి..జస్టిస్ లోకూర్ నేతృత్వంలో విచారణను పూర్తి చేసింది ప్రభుత్వం. ఇక ఇప్పుడు జస్టిస్ లోకూర్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ కోరాలని సీఎం రేవంత్ రెడ్డి డెసిషన్ తీసుకోవడం పొలిటికల్‌గా చర్చనీయాంశం అవుతోంది.రాజకీయ విశ్లేషణఇప్పటికే రాష్ట్రంలో రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కాళేశ్వరం కేసును కూడా సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ వేదికగా నిర్ణయాన్ని ప్రకటించింది ప్రభుత్వం. అంతేకాదు..రెండు సార్లు కేంద్రానికి లేఖ కూడా రాసింది రేవంత్ సర్కార్. కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరి 10 నెలలు గడుస్తోంది. అయినా? కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదంటోంది రాష్ట్ర ప్రభుత్వం. అయినప్పటికీ, విద్యుత్ కుంభకోణంపై రేవంత్ మళ్లీ సీబీఐనే ఎంచుకోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.సీబీఐ భుజంపై తుపాకి పెట్టి..బీఆర్ఎస్, బీజేపీని టార్గెట్ చేయాలన్నదే రేవంత్ ప్లాన్‌గా కనిపిస్తోంది. కాళేశ్వరంతో పాటు..విద్యుత్ కొనుగోళ్ల కేసులో..కేంద్రం సీబీఐ విచారణకు అంగీకరిస్తే..గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ చిక్కుల్లో పడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. ఒకవేళ సీబీఐ విచారణపై..కేంద్రం స్పందించకపోతే..బీజేపీ-బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం..సీక్రెట్ ఫ్రెండ్ షిప్ ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లడమే రేవంత్ అసలు ప్లాన్ అంటున్నారు. దీంతో..ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా..విచారణ జరిగితే బీఆర్ఎస్ ఇరికిపోతుంది..విచారణ జరగకపోతే ప్రజల ముందు బీజేపీని దోషిగా నిలబెట్టొచ్చన్నది రేవంత్ రెడ్డి వ్యూహంగా చెబుతున్నారు.

గత సర్కార్ హయాంలో అక్రమాలు, అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తూ వస్తున్న రేవంత్ ప్రభుత్వం..సాక్షాధారాలతో ప్రూవ్ చేయాలనే ప్లాన్‌తో ముందుకెళ్తోందట.

దీనిలో భాగంగానే..కాళేశ్వరం కమిషన్, జస్టిస్ లోకూర్ కమిషన్ రిపోర్టులను అస్త్రాలుగా మలుచుకుని కేసీఆర్ హయాంలో అక్రమాలు జరిగాయని ఎక్స్‌పోజ్ చేసే స్కెచ్ వేస్తున్నారట. మరింత వ్యూహాత్మకంగా..బాల్‌ను కేంద్రం కోర్టులోకి నెట్టి..బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా వ్యూహాన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నారట. కాళేశ్వరం, కరెంట్ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరుగుతుందో..లేక పొలిటికల్ హాట్ టాపిక్‌గానే కొనసాగుతుందో చూడా

# పిఠాపురం నుంచే బాబు స్టార్ట్...

## - తమ్ముళ్లకు వార్నింగ్



**కాకినాడ -సూర్య వాస్తవం :**

పర్సనల్ ఎజెండాలు వద్దు. మీ అభిప్రాయాలు పార్టీ మీద నెట్టొద్దు. కూటమి ముఖ్యం. పార్టీకే ప్రాధాన్యం. ఇది అర్థం చేసుకుంటే బెటర్. లేకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఇక మీ ఇష్టమంటూ లీడర్లకు, క్యాడర్‌కు ఎన్నోసార్లు క్లియర్ కట్ ఇండికేషన్ ఇస్తూ వచ్చారు సీఎం చంద్రబాబు. పై స్థాయిలో పవన్‌తో తనకు మంచి రిలేషన్ ఉంది..కలిసే ఉంటాం..కలిసే నడుస్తాం ఫిక్స్ అయి పోండని కూడా చెప్పేశారు. ఎక్కడా ఎలాంటి తేడాలు రావడానికి వీల్లేదని పలుసార్లు హెచ్చరించారు కూడా. కొందరు నేతల తీరుతో కూటమి డిస్టర్బ్ అయ్యే పరిస్థితి వస్తే ఊరుకునేది లేదని చెప్పిన చంద్రబాబు..అన్నంత పని చేశారు. ఏకంగా పార్టీకి లాయలిస్ట్‌గా, సిన్సియర్ కార్యకర్తగా పేరున్న వర్మను పిఠాపురం ఇంచార్జ్ పదవి నుంచి తప్పించి షాక్ ఇచ్చారు చంద్రబాబు. ఆల్రెడీ పార్టీ కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కూడా ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఫ్లెక్సీలు, ఫెక్సీలో ఫోటో కోసం గొడవేంటి అంటూ ఇన్‌డైరెక్ట్‌గా వర్మకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆయన్ను పార్టీ ఇంచార్జ్ పదవి నుంచి తొలగించారు. అయితే తనను పిఠాపురం బాధ్యతల నుంచి తప్పిం చడంపై స్పందించిన వర్మ..పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వర్మ. ఫక్తు టీడీపీ కార్యకర్త. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా..పవర్‌లో ఉన్నా.. వర్మది వన్ లైన్ ఎజెండా..పార్టీ కోసం పని చేయడమే. అయితే గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా పిఠాపురం సీటును జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌కు ఇచ్చారు. అప్పుడే వర్మ తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో..చంద్రబాబుతో సహా లోకేశ్ సర్దిచెప్పి భవిష్యత్‌పై భరోసా ఇచ్చారు. ఫ్యూచర్‌లో ఎమ్మెల్సీ లేకపోతే మరేదైనా ఆ స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్ ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే అధిష్టానం మాటకు కట్టుబడి పవన్ కోసం ప్రచారం చేశారు వర్మ. ఆయన ఫ్యామిలీ కూడా పవన్ గెలుపు కోసం హార్ట్ ఫుల్‌గా క్యాంపెయిన్ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక వర్మకు ఏదో ఒక పదవి ఇస్తారన్న టాక్ నడిచింది. మధ్యలో ఇద్దరు గన్‌మెన్‌లను కూడా ఇచ్చింది ప్రభుత్వం. కానీ ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో రానురాను వర్మలో అసంతృప్తి బయటపడుతూ వచ్చింది. తనకు ఏ పదవి దక్కలేదన్న అసంతృప్తితో..ఇంటెన్షన్ వేరు..బరస్ట్ అవుతున్నది అందుకోసం కాదు అన్నట్లుగా ఎప్పుడూ ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉంటూ వచ్చారు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని ఓసారి అధికారులపై సీరియస్ అయ్యారు వర్మ. మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో మాటల యుద్ధం నడిచింది. దీంతో కూటమిలో కుత కుతలతో.. పవన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలకు పొసగట్లేదన్న వార్తలు హల్‌చల్ చేశాయి. ఇక ఇలా చూసుకుంటే పోతే మొదటికే మోసం వస్తుందని భావించిన సీఎం చంద్రబాబు..కీలక నిర్ణయం




తీసుకున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించు కుంటున్నారు. వర్మ పార్టీ కోసం పని చేసిన సిన్సియర్ కార్యకర్తే అయినా..ప్రస్తుత పరిస్థితుల్లో కూటమికే చంద్రబాబు ప్రయారిటీ ఇస్తున్నారన్నది ఓపెన్ సీక్రెట్ అయిపోయింది. వార్తా సేవలుఅయితే ఒక్క పిఠాపురంలోనే కాదు.. రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల మధ్య పొసగట్లేదు. కొన్ని చోట్ల అయితే టీడీపీ ఎమ్మెల్యేలు టంగ్ స్లిప్ అవుతూ పార్టీకి తలనొప్పులు తెచ్చుపెడుతున్న పరిస్థితి. ఇలా అన్ని గమనించిన చంద్రబాబు..పిఠాపురం నుంచే ఆపరేషన్ స్టార్ట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది.

వర్మ లాంటి నేతకే షాక్ ఇచ్చారనే ఇండికేషన్ ఒకటి అయితే..పవన్‌కు, కూటమికి చంద్రబాబు ఇస్తున్న ప్రయారిటీ కూడా ఎక్స్‌పోజ్ చేసినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు పదవి నుంచి తప్పించింది వర్మనే అయినా..ఈ సెగ అందరికీ తాకేలా చేయాలన్నదే బాబు ఆలోచనగా చెప్పు కుంటున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, బీజేపీ కూడా ఇలాగే సైడ్ ట్రాక్ పడితే ఇంతే స్ట్రిక్ట్‌గా బిహేవ్ చేసేలా బాబు రూట్‌మ్యాప్ వేశారని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా పిఠాపురం వర్మ విషయంలో బాబు తీసుకున్న డెసిషన్ అయితే పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది.

# పాలన పట్ల ప్రజల్లో 73.5శాతం సంతృప్తి స్థాయి ఉందని చెప్పడం హాస్యాస్పదం

- ఇది సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడమే!
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో 73.5% సంతృప్తి స్థాయి ఉందని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఇది సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

**రైతులు**

శనివారం తులసి రెడ్డి వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో 70 శాతం మంది రైతులు ఉన్నారు . రైతులలో ప్రభుత్వం పట్ల నూటికి నూరు శాతం అసంతృప్తి ఉంది.ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదు . ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పంటల బీమా పథకం అమలు కావడం లేదు . వ్యవసాయము దండగనే వాతావరణం వచ్చింది.అందువల్ల రైతులలో నూటికి నూరు శాతం ప్రభుత్వ పాలన పట్ల అసంతృప్తి ఉంది.

**ఉద్యోగులు**

ప్రభుత్వ పాలన పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు నూటికి నూరు శాతం అసంతృప్తితో వున్నారు.ఇప్పటివరకు 12వ పిఆర్సి వేయలేదు . ఐ.ఆర్ ప్రకటించలేదు. 4 డి ఏ లు పెండింగ్లో ఉన్నాయి.35 వేల కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉన్నాయి.అందువలన ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి ఉంది.

**నిరుద్యోగులు**

నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీలలో పేర్కొని 22 నెలలుగా అమలు చేయని కారణంగా నిరుద్యోగుల్లో ప్రభుత్వ పాలన పట్ల తీవ్రమైన అసంతృప్తి ఉంది.

**విద్యార్థులు**

ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయని కారణంగా, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవన్నీ కారణంగా ప్రభుత్వం పట్ల విద్యార్థులు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారు.

**ఆడబిడ్డలు**

ఆడబిడ్డ నిధి కింద 19 -- 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి సూపర్ సిక్స్ హామీలలో పేర్కొని 22 నెలలుగా ఇవ్వని కారణంగా ఆడబిడ్డల్లో ప్రభుత్వం పట్ల ఆక్రోషం ఉంది.

**బీసీ,ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు.**

బీసీ, ఎస్సీ, ఎస్టీ,ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే సామాజిక పెన్షన్ ఇస్తామని చెప్పి 22 నెలలుగా ఇవ్వని కారణంగా ఆయా వర్గాలలో ప్రభుత్వ పాలన పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉంది. పై వివరాలు పరిశీలిస్తే ప్రభుత్వ పాలన పట్ల ముఖ్యమంత్రి చెప్పినట్లు 73.5శాతం సంతృప్తి లేదు.73.5శాతం అసంతృప్తి ఉందని తులసి రెడ్డి వివరించారు.

## ప్రముఖులతో బీటెక్ రవి మర్యాదపూర్వక కలయిక





**పులివెందుల– సూర్య వాస్తవం:** ప్రముఖ పారిశ్రామికవేత్త జి.ఎన్. నాయుడు సంస్మరణ సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును బీటెక్ రవి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. శనివారం హైదరాబాద్లో నిర్వహించిన ప్రముఖ పారిశ్రామికవేత్త జి.ఎన్. నాయుడు సంస్మరణ సభకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ , మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. జి.ఎన్. నాయుడు సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు స్మరించు కున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జోనల్ కో–ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకొండారెడ్డి కాలనీ సమస్యలపై వైఎస్ మనోహర్ రెడ్డి తక్షణ స్పందన



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండారెడ్డి కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై వైఎస్ మనోహర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

**క్షేత్రస్థాయి పరిశీలన**


ప్రజల విజ్ఞప్తి మేరకు,వైఎస్ మనోహర్ రెడ్డి సంబంధిత మున్సిపల్ అధికారులతో కలిసి కాలనీలోని సమస్య ఉన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గమనించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. యూజిడీ, ఎస్టీపి, నీటి సమస్యలను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ అధ్య క్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడమే మా ప్రాధాన్యత అని వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంజన్నకు విశేష పూజలు



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## యాడికి నూతన ఎస్సైగా గోపాల్ బాధ్యతల స్వీకరణ



**యాడికి – సూర్య వాస్తవం :** యాడికి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా గోపాల్ బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై వెంకటరమణ పదవీ విరమణ పొందారు. అనంతపురం వీఆర్ లో ఉన్న గోపాల్ను ప్రభుత్వం యాడికి స్టేషన్కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.బాధ్యతలు చేపట్టిన ఎస్సై గోపాల్ కు శుభాకాంక్షలు తెలిపిన సీఐ శ్రీనివాసులు

## ఇసుకపల్లి గంగిరెడ్డికి శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె మండలం,పాములూరు గ్రామానికి చెందిన ఇసుకపల్లి గంగిరెడ్డి అనారోగ్యంతో శనివారం స్వర్గస్తులయ్యారు. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,నామా వినయ్ గంగిరెడ్డి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని పరమేశ్వరుని ప్రార్థించారు.గంగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప సానుభూతిని తెలియజేశారు.

## చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం

### - మారెడ్డి జోగిరెడ్డి



**వేముల – సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గంలోని పులి వెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం వేముల మండల పరిధిలోని పీబీసీ కాలవలో పేరుకుపోయిన జమ్మును తొలగించే పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసిపరిశీలించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా పీబీసీ కాలవల్లో జమ్ము పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించిందని చెప్పారు. దీంతో రైతులకు సాగునీరు అందించడం కష్టతరంగా మారిందన్నారు. సమస్య పరిష్కారానికి జేసీబీల సహాయంతో కాలవల్లో పేరుకుపోయిన జమ్మును తొలగిస్తున్నామని వెల్లడించారు. జమ్ము తొలగింపుతో నీటి ప్రవాహం వేగవంతమై, అన్ని చెరువులకు సమర్థవంతంగా నీరు చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీల చైర్మన్లు మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామిరెడ్డి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టే హనుమాన్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఇఓ కడప సుభాష్, ఆలయ చైర్మన్ పివి.రమణలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వృషబాచలేశ్వర స్వామి ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 10 వ తేది నుండి 12వ తేది వరకు మూడు రోజుల పాటు వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైశాఖ మాసంలో ప్రతి ఏడాది హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 10 వ తేది ఆదివారం విశ్వ శేణా ఆరాధన పుణ్యాహవచనం, అంకురార్పణ తో ప్రత్యక పూజాలు ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. 11వ తేదిన కలశ ప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, హనుమాన్ చాలీసా ప్రారాయణం, సుందర కాండ ప్రారాయణం, రామ తారక హుమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ మంగళవారం కుంభ ఆరాధన, రామాయణ ప్రారాయణం, మన్య సుక్త హుమాలు, మూర్తి హమాలతో పాటు తదితర పూజాలు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు శ్రీవీరాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి విశేష ఆలకరణ చేసి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేంపల్లెలోని గ్రామ పెద్దలు, హిందువులు అందరు ఇదే అహ్వానంగా భావించి హనుమాన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు పొందాలని కోరారు. ఆర్ జెసి ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధికి చెందిన ప్రతిపాదనలు కూడ పంపుతున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని దేవదాయ శాఖ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పులివెందుల టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి కూడ టిడిపి అధికారులను, పాలక మండలి సభ్యులను కోరినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకుడు హరి ప్రవీణ్, దేవస్థానం సిబ్బంది దాసిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి దేవస్థాన మహోత్సవ ఆహ్వానం

**వేంపల్లె – సూర్య వాస్తవం :** మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానము నందు ధ్వజ, శిఖర, ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను తెలుగుదేశం పార్టీ నాయకులు అయినా బాలస్వామి రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ ఎస్ ఎండి షబ్బీర్, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి లకు ఆ గ్రామ టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. నాయకులను ఆహ్వానించిన వారిలో అయ్యవారిపల్లె టీడీపీ నాయకులు రమణారెడ్డి, చంద్రారెడ్డి, శివప్రసాద్, ట్రేడ్ యూనియన్ లీడర్ రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.





# ఘనంగా ముగిసిన విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా

**పామిడి– సూర్య వాస్తవం:** మండల పరిధిలోని కాళాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించిన ప్రతిష్టా కార్యక్రమలు తోటపల్లి సూర్య నారాయణశర్మ బృందం ఆధ్వర్యంలో వేదపండితుల చేత అంగరంగ వైభవోపేతంగా ముగిసినవి. దాదాపు 7 దశాబ్దాలుగా బీసీ సామాజిక వర్గానికి, అగ్రకుల వర్గానికి ఫ్యాక్షన్ ఏర్పడంతో కత్తికి కత్తి, హత్యకు హత్య, బదులుకు బదులు అంటూ దాదాపు 8,9 హత్యలు జరుపుకొని నిరంతరం పగ, కక్షలతో కత్తులు, వేట కోడవల్లు, బాంబులు, రివాల్వరులతో రగులతూ చిన్నా భిన్నమైన ఆస్తులు,కుటుంబాలు కలవు.అలాంటి రక్త చరిత్ర గల గ్రామం ఈనాడు ఎంతో ఐక్యతాభావంతో గ్రామం అంతటా ఏకీభవంతో దాదాపు కోటి రూపాయల వ్యయంతో గుంతకల్లు నియోజకవర్గ పరిధిలో ఎక్కడ నిర్మించని విధంగా నిర్మించుకున్నారు. ప్రతిష్ట మూడు రోజులు గ్రామమంతటా, భక్తిశ్రద్ధలతో నిష్ఠగరిస్తులై ఆధ్యాత్మికంలో మునిగిపోయారు. గురువారం గణపతి పూజతో ప్రారంభించి శుక్రవారం హోమాలను నిర్వహించి శుక్రవారం రాత్రి ఉక్కుముడిగా ప్రతి ఇంటి నుండి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో మహిళలు కలిశం, కంచ హారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. పండరభజన లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం విశ్వేశ్వరస్వామి లింగప్రతిష్ట, నందీశ్వర,నవగ్రహాలు, 36 అడుగుల ధ్వజస్తంభం ప్రతిష్టలు వేదపండితులు చేత ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమాలను తిలకించుటకు వచ్చిన వేలాది మంది స్వామివారి దర్శించుకుని తీర్చుకున్నారు. ప్రతిఇంట ఆడపడుచులకు, అల్లుళ్లకు ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిలకించుటకు వచ్చిన వేలాదిమంది బంధువులు, స్నేహితులు, భక్తులకు ఐక్యమత్యమే మహాబలమని, ఫ్రాక్షన్ శత్రుత్వం వద్దని,భక్తి,ఆధ్యాత్మికం ముద్దు అని వీటివల్ల గ్రామం ఎంతో ప్రశాంతత కలిగి పాడిపంటలతో కళకళలాడుతూ గ్రామాభివృద్ధి కలుగుతుందని నిరూపించారు. యావత్ మానవ లోకానికి ఆదర్శంగా నిలిచింది.నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చినవాళ్లు గ్రామము యొక్క ఐక్యతకు, ఆధ్యాత్మికకు భక్తికి ముక్కున వేలు వేసుకొని గ్రామ ప్రజలకు జై కొడుతూ అభినందనలు తెలిపారు.





# “ఉచిత కంటి వైద్య శిబిరం” విజయవంతం!

## -ముగింపు సభకు విశేష స్పందన

**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు మరియు యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో బెంగళూరు చిట్టెం హనుమాన్ ప్రసాద్, చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి వారి సహకారంతో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శనివారం పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సభ జరిగినది. ఈ కార్యక్రమానికి కంటి వైద్య నిర్వాహకులు చిట్టెం హనుమాన్ ప్రసాద్, శాంతి, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ సురేష్ కుమార్, కర్నూల్ వాటర్ రిసోర్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణ నాయక్, పూర్వ విద్యార్థులు శివయ్య, రామకృష్ణప్ప, వీరేశప్ప లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చదువుకొని ఉన్నత స్థాయిలో ఉన్న వారు పుట్టిన ఊరి కోసం ఏదో ఒక విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మన పత్తికొండ లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఇక్కడే చికిత్సల అనంతరం కంటి ఆపరేషన్లు చేయడం జరిగిందని, 90 మంది కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు సంతోషంగా ఉన్నారని వారు తెలిపారు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు మరియు యువ స్పందన సొసైటీ సభ్యులు ఆధ్వర్యంలో అందరి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం దిగ్విజయంగా ముగిసిందని పేర్కొన్నారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందికి మరియు వాలంటీర్లకు మెమోంటో , శాలువాలతో సన్మానం చేయడం జరిగింది. కంటి ఆపరేషన్లు చేయించుకున్న ఆస్పత్రి వైద్యులు వారికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ స్పందన సొసైటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సభ్యులు మధు, రమేష్, గిరీష్, రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు మహబూబ్ బాషా, శ్రీధర్, మద్దిలేటి రెడ్డి, జిలాన్, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# క్రిస్టియన్ లైన్‌లో వెలిగిన వీధిదీపాలు

## - సమస్యను పరిష్కరించిన టీడీపీ నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డి

**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ లైన్ నివాసితుల దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో వీధిలైట్లు లేక స్థానికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి కారణంగా అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డి వెంటనే స్పందించారు.ఆయన స్వయంగా పులివెందుల పురపాలక సంఘ (మున్సిపల్) కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి,సమస్య తీవ్రతను వివరించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మధుసూదన్ రెడ్డి చొరవతో మున్సిపల్ అధికారులు స్పందించి శనివారం క్రిస్టియన్ లైన్‌లో కొత్త వీధిలైట్లను ఏర్పాటు చేశారు.సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెం శ్యామ్, మనోహర్, వసంత్ బాబు,నిఖిల్, శిఖమని,అభి మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.



# చెన్నూరులో పోతులూరయ్య స్వామి ఊరేగింపుతో జాతర







**చెన్నూరు– సూర్య వాస్తవం :** చెన్నూరు కే ఓ ఆర్ కాలనీలో వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లి( ఎల్లమాంబ) జాతర పదవ తేదీ ఆదివారం నిర్వహిస్తుండడంతో జాతరకు ముందు రెండు రోజులు శ్రీ ఎల్లమ్మ తల్లి సోదరుడైన పోతులూరయ్య స్వామి ఊరేగింపు శుక్రవారం ఉదయం ఆలయం దగ్గర నుంచి డప్పులతో చెన్నూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పసుపు కుంకుమలు బేడలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు పోతులూరయ్య స్వామికి పసుపు కుంకుమలతో పాటు బేడలు సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు రోజులపాటు శనివారం కూడా గ్రామంలో ఇంటింటికి పోతులూరి స్వామి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లమ్మ దేవాలయం వద్ద జాతర సందడి మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. జాతర రోజున ఆలయం వద్ద సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తిరుణాల మహోత్సవం నిర్వహిస్తారు. ఇందులో వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు . ఎల్లమ్మ తిరుణాలను పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

# జాతరలో సామరస్యమే ప్రధానం

## - అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా సహకరించాలి : సీఐ చాంద్ బాషా

**చెన్నూరు– సూర్య వాస్తవం :** ఎల్లమ్మ జాతర ఊరేగింపు సందర్భంగా ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు చోటుచేసుకోకుండా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని చెన్నూరు సీఐ ఎస్.కె చాంద్ భాషా కోరారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా జాతరను ఐక్యమత్యంతో, మత సామరస్య వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల దృష్ట్యా డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతర ఊరేగింపు, ఆలయం వద్ద భక్తులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఎస్ఐ సుధాకర్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, ఇరువర్గాల పెద్దలు పాల్గొన్నారు.







# అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

**పులివెందుల– సూర్య వాస్తవం:** స్థానిక డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి హాస్పిటల్‌లో శనివారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో హాస్పిటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, ముందస్తు జాగ్రత్తలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ఇన్చార్జి ఫైర్ ఆఫీసర్ బి. జగన్నాథ్ రెడ్డి మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొని, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తలను వివరించారు. హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ లిఫ్టును ఉపయోగించకూడదని,కేవలం మెట్ల మార్గాన్ని మాత్రమే వాడాలని అధికారులు స్పష్టం చేశారు.అగ్నిని అదుపు చేసే ‘ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్’ను ఎలా ఆపరేట్ చేయాలో సిబ్బందికి ప్రత్యక్షంగా చేసి చూపించారు. ?ప్రమాద సమయంలో పొగ వల్ల స్పృహ తప్పి పడిపోయిన వారిని క్షేమంగా బయటకు ఎలా తీసుకురావాలో మాక్ డ్రిల్ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.?అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భయాందోళనకు గురికాకుండా,సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణ,ఆస్తి నష్టాన్ని ఎలా నివారించవచ్చో ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ వివరించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కుంకీ ఏనుగులకు ఆధార్‌లా ఓ గుర్తింపు కార్డు



**తిరుపతి–సూర్య వాస్తవం:** ఏపీ ప్రభుత్వం గతేడాది కర్ణాటక నుంచి కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఏనుగులు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో ఉన్నాయి. అయితే ఈ ఏనుగులకు రెండు రోజుల క్రితం డీఎన్ఏ టెస్టులు నిర్వహించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి డెహ్రాడూన్ పంపారు. ఆ టెస్ట్ రిజల్ట్స్ వచ్చిన తర్వాత ఏనుగులకు ఆధార్ కార్డులా ఓ గుర్తింపు కార్డును తగిలించనున్నారుసాధారణంగా మనుషులకు ఆధార్ కార్డులు ఉంటాయి.. ఎక్కడైనా ఏనుగులకు ఆధార్ కార్డులు ఉండటం చూశారా. ఏపీలో మాత్రం ఏనుగులకు ఆధార్ కార్డులు రాబోతున్నాయి.. అది కూడా ఆరు గజరాజులకు మాత్రమే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని గమనించి అటవీశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో కుంకీ ఏనుగులు ఉన్నాయి.. వీటికి అధికారులు డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఈ ఏనుగుల నుంచి రెండు రోజుల క్రితం రక్త నమూనాలను సేకరించి డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపారు.ఏనుగుల సంరక్షణ, పరిరక్షణ, శాస్త్రీయ అధ్యయనాల నిమిత్తం అధికారులు ఈ డీఎన్ఏ పరీక్షలు చేయించి ఆధార్ కార్డులా ఉండేట్టు ఓ గుర్తింపు కార్డును ఏనుగుకు తగిలించనున్నారు. డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ నుంచి టెస్టుల ఫలితాలు రాగానే ఆ వివరాలతో ఏనుగుకు ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ఈ కుంకీ ఏనుగులకు ఇది ఆధార్ కార్డులా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ వివరాలతో రాబోయే రోజుల్లో ఏనుగులకు జన్యుపరమైన సమస్యలకు వైద్యంతో పాటు వాటి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు అంటున్నారు. భవిష్యత్తు అవసరాలని గమనించి గజరాజులకు సంబంధించిన సమగ్ర వివరాల కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి నుంచి కుంకీ ఏనుగుల్ని రప్పించిన విషయం తెలిసిందే. అభిమన్యు, కృష్ణ, దేవ, జయంత్, రంజన్, వినయ్ అనే ఆరు కుంకీ గజరాజుల్ని తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పలమనేరు క్యాంపులో ఉంచారు. ఈ కుంకీ ఏనుగుల దర్వారా అడవిలోని ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా మళ్లించడానికి శిక్షణ ఇచ్చారు. రెండుసార్లు ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా అటవీ ప్రాంతంవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతం చేశారు. కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగుల్ని తీసుకురావడానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్కడి ప్రభుత్వ పెద్దలతో చర్చించారు. గతేడాది కుంకీ ఏనుగుల్ని కర్ణాటక నుంచి ఏపీకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

# అమరావతికి మ్యారియట్ హ్యాటల్స్

**అమరావతి–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. అమరావతిలోని లింగయ్యపాలెం గ్రామంలో సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'కోర్ట్‌యార్డ్ బై మ్యారియట్' హోటల్ ప్రాజెక్ట్‌కు ఘనంగా భూమిపూజ నిర్వహించారు. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో ఈ ఫోర్ స్టార్ డీలక్స్ హోటల్‌ను నిర్మించనున్నారు. సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో రెండు టవర్లుగా ఈ హోటల్‌ను నిర్మించనున్నారు. ప్రతి టవర్‌లో 10 అంతస్తులు ఉండనున్నాయి.మొత్తం 176 లగ్జరీ గదులు మరియు రెసిడెన్సీలు ఉంటాయి. స్విమ్మింగ్ పూల్, ఆధునిక జిమ్, బార్, మరియు ఆల్‌డే డైనింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. ఏకకాలంలో 2 వేల నుంచి 3 వేల మంది కూర్చునే సామర్థ్యంతో భారీ బ్యాంకెట్ హాల్‌ను కన్వెన్షన్లు మరియు ఈవెంట్స్ కోసం నిర్మిస్తున్నారు. మరో 6 నెలల్లో ఈ హోటల్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. రెండున్నరేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేసి, 2029 నాటికి హోటల్ కార్యకలాపాలను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సదరన్ గ్లోబ్ హోటల్స్ ప్రతినిధులు వెల్లడించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రతినిధి కృష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ.. అమరావతి అభివృద్ధి వేగవంతం కావడంతో అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లకు ఇక్కడ గొప్ప అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే క్వాంటమ్ వ్యాలీ వంటి పెద్ద సంస్థలు అమరావతికి వస్తుండటంతో పెట్టుబడులపై ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సింగిల్ విండో విధానం వల్ల అనుమతులు సులభంగా లభిస్తున్నాయని, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతోందని ఆయన కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇటువంటి లగ్జరీ హోటళ్ల రాకతో అమరావతి ముఖచిత్రం గ్లోబల్ సిటీగా మారనుంది.




# ఆదాయంలో విశాఖ రికార్డ్...

**విశాఖపట్టణం–సూర్య వాస్తవం:**

రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. రూ. 1,61,009 కోట్ల జీడీపీతో విశాఖ సత్తా చాటింది. గురువారం నుంచి జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు ప్రభుత్వం నివేదిక విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, జిల్లా స్థాయి పురోగతి, డేటా ఆధారిత పరిపాలన, స్వర్ణ ఆంధ్ర - 2047 దార్శనికత అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం వెల్లడించారు. స్వర్ణ ఆంధ్ర - 2047 విజన్ కింద రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించింది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్డీపీని రూ. 308 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా "పది సూత్రాలు" మిషన్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలులోకి తీసుకువచ్చారు. అభివృద్ధి పురోగతిని నిరంతరం కొలిచేందుకు 651 కీలక పనితీరు సూచికలతో కూడిన సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందించారు. ఇందులో 232 ఆర్థిక సూచికలు, 304 పాలన సూచికలు, 115 సామాజిక?సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సూచికలు ఉన్నాయి. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల వరకు నెలవారీ పనితీరు నివేదికలను ప్రవేశపెట్టి, అభివృద్ధి ఫలితాలను క్రమబద్ధంగా పర్యవేక్షించే వ్యవస్థను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇక సదస్సులో 2025?26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం రూ.17.62 లక్షల కోట్ల జీఎస్డీపీతో 10.75% వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. దేశ సగటుతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతిగా పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగం 7.83% వృద్ధిని నమోదు చేయగా, చేపల పెంపకం రంగం 19.07% వృద్ధితో అత్యుత్తమ పనితీరు కనబరిచింది. నిర్మాణ రంగం 13.05%, కమ్యూనికేషన్స్ రంగం 17.05%, బ్యాంకింగ్ ఱ భీమా రంగం 15.45% వృద్ధిని సాధించాయి. పరిశ్రమల రంగం మొత్తం మీద 9.53%, సేవల రంగం 12.94% వృద్ధిని నమోదు చేశాయి. ఈ పురోగతి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని సూచిస్తున్నదని అధికారులు వివరించారు. మరోవైపు జిల్లాల వారీగా పరిశీలిస్తే, బాపట్ల జిల్లా 19.19% వృద్ధితో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. విశాఖపట్నం జిల్లా రూ.1,61,009 కోట్ల జీడీపీతో రాష్ట్ర ఆర్థిక కేంద్రంగా నిలిచింది. తలసరి ఆదాయంలో కూడా రూ.6.58 లక్షలతో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఎన్టీఆర్, కృష్ణా, తిరుపతి, ఏలూరు జిల్లాలు కూడా మంచి ఆర్థిక పురోగతిని నమోదు చేశాయి. మరోవైపు, అన్నమయ్య జిల్లా మైనస్ 1.35% ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. దీంతో ఆ జిల్లాపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం నమోదవడం ప్రాంతీయ అసమానతలను సూచిస్తున్నదని అభిప్రాయం వ్యక్తమైంది.. మరో 3 పార్టీల మద్దతు ఇదే సమయంలో 2026?27 సంవత్సరానికి మరింత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. జీఎస్డీపీని రూ.20.36 లక్షల కోట్లకు పెంచి 15.53% వృద్ధి సాధించాలన్నది ప్రధాన లక్ష్యం. వ్యవసాయ, అనుబంధ రంగం 14.04%, పరిశ్రమల రంగం 17.47%, సేవల రంగం 15.80% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపరంగాల వారీగా చూస్తే, చేపల పెంపకం రంగానికి 20.66%, నిర్మాణ రంగానికి 20.5%, మైనింగ్‌కు 18%, తయారీ రంగానికి 15.5%, వాణిజ్యం?హోటళు ్ల?రెస్టారెంట్లకు 16.5%, బ్యాంకింగ్, బీమా రంగాలకు16% వృద్ధి లక్ష్యాలను నిర్ణయించారు. తలసరి ఆదాయాన్ని రూ.2,94,507 నుంచి రూ. 3,39,404కు పెంచి 15.24% వృద్ధిని సాధించాలన్నది మరో కీలక లక్ష్యంగా పేర్కొన్నారు. 2025?26లో నమోదైన 10.75% జీఎస్డీపీ వృద్ధి రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదిని అందించగా, 2026?27లో 15.53% వృద్ధి లక్ష్యం సాధించదగినదిగా సదస్సు విశ్వాసం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నెలవారీ పనితీరు ట్రాకింగ్, విలువ జోడింపు, ౦ఎ ఆధారిత పరిపాలన, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు, డేటా ఆధారిత నిర్ణయ వ్యవస్థలు కలిసి స్వర్ణ ఆంధ్ర - 2047 దిశగా రాష్ట్రాన్ని స్థిరమైన, సమగ్ర, వేగవంతమైన అభివృద్ధి మార్గంలో ముందుకు నడిపిస్తున్నాయని సదస్సు స్పష్టం చేసింది.




# కూటమి గూటికి వైసీపీ ఎమ్మెల్యేలు

**విజయవాడ–సూర్య వాస్తవం:**

ప్రస్తుతం కూటమిలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారిలో కొంత మంది వైసీపీకి టచ్ లో ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వైసిపి నాయకులు సైతం అవును... కొందరు టచ్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఇది వాస్తవమేనా.. అసలు ఆ పరిస్థితి ఎందుకు వస్తుంది.. అనేది రాజకీయంగా ఆసక్తిగా మారింది. నిజానికి ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఎవరూ ఊహించరు. కానీ రాష్ట్రంలో కొంతమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అలాంటి వారిని వైసిపి నాయకులు తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు అయితే చేస్తున్నారు..కానీ ఎవరూ ఈ విషయంలో బయటపడటం లేదు. వచ్చే ఎన్నికల నాటికి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేలా వైసిపి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలోనే ఇప్పుడు కొంత మంది ఎమ్మెల్యేలు తమ వైపు ఉన్నారని చెబుతుండడం ఆసక్తిగా మారింది. అయితే, ఇప్పటికిప్పుడు దీనివల్ల ఇటు కూటమికి వచ్చిన నష్టం కానీ అటు వైసిపికి వచ్చిన లాభంగానీ ఏమీ కనిపించడం లేదు. ఇది కేవలం ప్రచారం మాత్రమే. ఇది ఒక రకంగా ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న పరోక్ష వ్యతిరేక ప్రచారంగా కూడా పరిశీలకులు భావిస్తున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే



ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని.. పాలనకు కూడా వ్యతిరేకంగా ఉన్నారని.. చెప్పడం ద్వారా ప్రభుత్వాన్ని పలుచన చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అటు సీమ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకు కొంతమంది ఎమ్మెల్యేల పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వంలో ఉన్నప్పటికీ వారు అసంతృప్తితోనే ఉన్నారు. ఈ విషయంపై పార్టీలోనూ ప్రభుత్వంలోనూ చర్చ కూడా నడుస్తోంది. ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. బిజెపిలో ఆదినారాయణ రెడ్డి నుంచి జనసేనలో లోకం మాధవి వరకు కూడా చాలామంది అసంతృప్తితో ఉన్నారు. ఇక, టిడిపిలో ఈ సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. అయితే, ఎప్పటికప్పుడు ఆయా పార్టీలు నేతలతో మాట్లాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని చక్కదిద్దుకునే దిశగా పని చేస్తున్నారు. కలివిడిగా ముందుకు సాగాలని చెబుతున్నారు. దీంతో తరచుగా వస్తున్న విభేదాలు ఒకింత సమస్యగా మారే పరిస్థితి ఏర్పడింది. కానీ, ఈ సమయంలోనే వైసీపీ ఇలాంటి నేతలను తమ వైపు ఉన్నారని చెప్పుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తుందన్న వాదన బలంగా వినిపిస్తోందిఇది నిజం కాదని, కొంతమందిలో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని అయినంత మాత్రాన వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్టు కాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఇక జనసేనలోనూ ఈ తరహా చర్చ నడుస్తున్నప్పటికీ ఎవరు పార్టీ వదిలేసి వెళ్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. బిజెపిలో ఈ విషయంపై నాయకులు మౌనంగా ఉన్నారు. ముఖ్యంగా ఆదినారాయణ రెడ్డి వంటి సీనియర్ నాయకుడి వ్యవహారంలో ఎవరు మాట్లాడటం లేదు. ఇక, ఉత్తరాంధ్రలో విష్ణుకుమార్ రాజు కూడా తీవ్ర అసంతృప్తి తో ఉన్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఆయన పార్టీని వదిలి వెళ్లే టైపు నాయకుడు కాకపోవడం విశేషం. మొత్తంగా చూస్తే వైసిపి చేస్తున్న ఎమ్మెల్యేల ప్రచారం కేవలం రాజకీయం కోసమేనని స్పష్టమవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

# యూత్ టార్గెట్‌గా మహానాడు

**నెల్లూరు–సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ ఈనెల ఆఖరిలో జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు కూడా వడివడిగా సాగుతున్నాయి. ఈ సారి ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇస్తూ.. శ్రీకాకుళం జిల్లాలో మహానాడు నిర్వహించాలన్నది టిడిపి ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో ఇప్పటికే ఏర్పాట్లు కూడా వడివడిగా సాగుతున్నాయి. అయితే ఈ మహానాడుకు చాలా ప్రత్యేకత ఉంది. టిడిపిలో ఇప్పటివరకు జరిగిన మహానాడులు వేరు. ఇప్పుడు జరుగుతున్న మహానాడు వేరు అనేది పార్టీలో నాయకులు చెబుతున్నారు. ఈ దఫా యువనాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మహానాడులో ఈసారి మొత్తం నారా లోకేష్ ప్రభావం కనిపిస్తుందని అదేవిధంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన యువనాయకత్వానికి ఎక్కువ అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా ఈసారి విధానపరమైన నిర్ణయాలు పార్టీ పరంగా భవిష్యత్తు వ్యవహారాలు వంటి అంశాల్లో కీలకమైన అంశాలను నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీ కి అప్ప చెబుతారని సమాచారం.

ముఖ్యంగా.. పార్టీ భవిష్యత్తు వ్యూహాలు ఈ దఫా యువతను టార్గెట్గా చేసుకొని ఉంటాయని కూడా అంటున్నారు. అయితే ఇవన్నీ పర్యవేక్షించేందుకు, పరిశీలించేందుకు లోకేష్ నేతృత్వంలో మహానాడు వేదికగా ఒక కమిటీ ఏర్పాటు అవుతుందని కూడా సమాచారం. అదేవిధంగా ఈ దఫా మహానాడులో యువత ఎక్కువగా ప్రసంగించేలా వారికి ఎక్కువ ప్రాధాన్యం ఉండేలా కూడా వ్యవహరిస్తున్నారన్నది పార్టీలో జరుగుతున్న చర్చ. భవిష్యత్తు అంతా యువనాయకత్వానిదే కాబట్టి ఈసారి మార్గదర్శకానికి మాత్రమే సీనియర్లు పరిమితం కానున్నారు. యువతకు ఎక్కువ అవకాశం కల్పించడం ద్వారా వారి ఆలోచనలను పంచుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపించాలి అనేది టిడిపి లక్ష్యంగా కనిపిస్తుంది.

ఈ క్రమంలోనే పార్టీ పరంగా ఎలా ఉన్నప్పటికీ యువతకు మెజారిటీ అవకాశాలు కల్పించాలని మహానాడు నిర్దేశిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఏం జరుగుతుందనేది చూడాలి. ప్రస్తుతానికైతే మహానాడు వేదికగా యువతకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఆమెరకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్న దరిమిలా.. ఈ మేరకు మహానాడుతోనే శ్రీకారం చుట్టనున్నారని సీనియర్‌లు చెబుతున్నారు.

## విజయ్ దేవరకొండ బర్త్ డే...

# 'రణబాలి' నుంచి స్పెషల్ గ్లింప్స్



విజయ్ దేవరకొండ పుట్టినరోజున 'రణబలి' మేకింగ్ గ్లింప్స్ విడుదల
గుర్రపు స్వారీ సన్నివేశాల కోసం విజయ్ పడిన కష్టాన్ని చూపిన చిత్రబృందం
గాయాలైనా లెక్కచేయకుండా కఠినమైన గుర్రాలతో శిక్షణ పొందిన విజయ్
19వ శతాబ్దం నాటి చారిత్రక కథాంశంతో వస్తున్న సినిమా
సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'రణబలి' టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' నుంచి ఒక ప్రత్యేక మేకింగ్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తున్నారు.

ఈ మేకింగ్ వీడియోలో 'రణబాలి' పాత్ర కోసం విజయ్ దేవరకొండ పడిన కష్టాన్ని చూపించారు. ముఖ్యంగా సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాల కోసం ఎంత తీవ్రంగా శిక్షణ తీసుకున్నాడో ఇందులో హైలైట్ చేశారు. మచ్చిక చేసుకోవడానికి అత్యంత కష్టమైన స్టాలియన్ జాతి గుర్రాలతో విజయ్ ప్రాక్టీస్ చేశారు. ఈ క్రమంలో పలుమార్లు గాయపడినప్పటికీ, పట్టుదలతో శిక్షణ పూర్తి చేసినట్లు వీడియో స్పష్టం చేస్తోంది. సినిమా పట్ల అతడి అంకితభావానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, "తెరపై ఈ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. అందుకే ఇంత కష్టమైన సీక్వెన్స్ అయినా చేయడానికి నేను సిద్ధపడ్డాను" అని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాలు, భారీ యాక్షన్ ఘట్టాలు ముఖ్య ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ తెలిపింది.

19వ శతాబ్దంలో, 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'రణబాలి' చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## 'ఫిదా'లో 'భానుమతి' పాత్ర కోసం

# ఆరు నెలల టైమ్ అడిగిన సాయి పల్లవి!



'ఫిదా' ఆఫర్ వచ్చేసరికి జార్జియాలో ఎంబీబీఎస్ చదువుతున్న సాయి పల్లవి
సినిమా కోసం దర్శకుడు శేఖర్ కమ్ములను ఆరు నెలలు టైమ్ అడిగిన వైనం
తెలంగాణ యాస నేర్చుకుని, సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పుకున్న సాయి పల్లవి
భానుమతి పాత్ర కోసం ఆమె డెడికేషన్
సినిమా విజయంలో కీలక పాత్ర
'ఫిదా' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి సాయి పల్లవి. ఆమె పోషించిన భానుమతి పాత్ర ఎంతగా ఆకట్టుకుందో తెలిసిందే. అయితే, ఆ పాత్ర అంతగా పండటం వెనుక ఆమె అంకితభావం, పట్టుదల ఉన్నాయి. దర్శకుడు శేఖర్ కమ్ముల 'ఫిదా' కథతో సంప్రదించినప్పుడు, సాయి పల్లవి జార్జియాలో ఎంబీబీఎస్ చివరి దశలో ఉన్నారు.

సినిమా చేయడానికి వెంటనే అంగీకరించినప్పటికీ, తన చదువు పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం కావాలని దర్శకుడిని కోరారు. ఆమె నిబద్ధతను అర్థం చేసుకున్న శేఖర్ కమ్ముల అందుకు అంగీకరించారు. 2016లో డిగ్రీ పూర్తి చేసుకుని వచ్చిన సాయి పల్లవి, ఆ తర్వాత 'ఫిదా' కోసం సిద్ధమయ్యారు. తమిళనాడుకు చెందిన ఆమెకు తెలంగాణ యాసలో మాట్లాడటం పెద్ద సవాలుగా మారింది. సాధారణంగా ఇతర భాషా నటీమణులకు డబ్బింగ్ ఆర్టిస్టులు గాత్రదానం చేస్తారు. కానీ, సాయి పల్లవి తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల సహాయంతో తెలంగాణ యాసలోని నుడికారాలను, ఉచ్చారణను ఓపికగా నేర్చుకున్నారు. డబ్బింగ్ సమయంలో ఎన్నో తప్పులు చేసినా, పట్టుదలతో మళ్లీ మళ్లీ ప్రయత్నించి భానుమతి పాత్రకు ప్రాణం పోశారు. ఆమె సొంత గొంతుతో పలికిన సంభాషణలకు థియేటర్లలో విశేష స్పందన లభించింది. ఈ డెడికేషనే ఆమెను తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేసింది.



# గిల్, సాయి సుదర్శన్ మెరుపులు..

# రాజస్థాన్ బౌలర్లు బేజారు

జైపూర్ లో రాజస్థాన్ రాయల్స్ ఐ గుజరాత్ టైటాన్స్
టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్
20 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసిన గుజరాత్
జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84), సాయి సుదర్శన్ (55) అద్భుత అర్ధశతకాలతో చెలరేగడంతో గుజరాత్ ఈ భారీ స్కోరును నమోదు చేసింది.



ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ తాత్కాలిక కెప్టెన్ యశస్వి జైస్వాల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం తప్పు అని నిరూపిస్తూ గుజరాత్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. రాజస్థాన్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 118 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. సాయి సుదర్శన్ 36 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు చేయగా, కెప్టెన్ గిల్ 44 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 84 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.

ఓపెనర్లు అందించిన శుభారంభాన్ని తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా చివర్లో వాషింగ్టన్ సుందర్ (20 బంతుల్లో 37 నాటౌట్), రాహుల్ తెవాటియా (4 బంతుల్లో 14 నాటౌట్) వేగంగా ఆడటంతో గుజరాత్ స్కోరు అమాంతం పెరిగింది.

రాజస్థాన్ బౌలర్లలో దాదాపు అందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ప్రధాన బౌలర్లు జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే తీవ్రంగా నిరాశపరిచారు. బ్రిజేష్ శర్మ 2 వికెట్లు పడగొట్టినప్పటికీ 47 పరుగులు ఇచ్చాడు. రవీంద్ర జడేజా ఒక వికెట్ తీసి కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. దీంతో, సొంత మైదానంలో ఆడుతున్న రాజస్థాన్ ముందు గుజరాత్ 230 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మకు నాడా నోటీసులు

క్రీడలు : భారత క్రికెటర్లు యశస్వీ జైస్వాల్, షఫాలీ వర్మలకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.
గత ఏడాది నిర్వహించాల్సిన నిర్ణీత డోప్ పరీక్షలకు ఈ ఇద్దరు హాజరుకాకపోవడంతో నాడా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నాడా రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ లో భాగంగా ఉన్న యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలు డోప్ పరీక్షలకు అందుబాటులో లేకపోవడంతో పాటు, గైర్హాజరుకు గల కారణాలను కూడా తెలియజేయలేదని సమాచారం.

ఈ నేపథ్యంలో వారికి వివరణ ఇచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తూ నోటీసులు పంపినట్లు వెల్లడైంది. ఇక ఈ నోటీసుల విషయాన్ని నాడా ఇప్పటికే బీసీసీఐ, ఐసీసీకి కూడా తెలియజేసినట్లు సమాచారం. గతేడాది డిసెంబర్ 17న యశస్వి జైస్వాల్‌కు, నవంబర్ 7న షఫాలీ వర్మకు డోప్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఆ సమయంలో వీరిద్దరూ పరీక్షలకు అందుబాటులో లేరని నాడా పేర్కొంది. దీంతో ఫిబ్రవరి నెలలో వారి నుంచి వివరణ కోరింది. కానీ ఎలాంటి స్పందన రాకపోవడంతో తాజాగా అధికారిక నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

అయితే ఒక్కసారి డోప్ టెస్టుకు హాజరుకాకపోవడం మాత్రమే డోపింగ్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడదు. కానీ 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోప్ పరీక్షలకు గైర్హాజరైతే రెండేళ్ల నిషేధాన్ని ఎదుర్కొనే అవకాశముందని నిబంధనలు చెబుతున్నాయి. ప్రస్తుతం యశస్వి జైస్వాల్ ఐపీఎల్ 2026లో బిజీగా ఉండగా, షఫాలీ వర్మ జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న టీ 20 ప్రపంచకప్‌కు సన్నద్ధమవుతున్నారు.



# రూ.2,200 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మెగా ప్లాంట్!




**విజయవాడ – సూర్య వాస్తవం :**
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్, తన భారీ మెగా ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. సుమారు రూ. 2,200 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. 1901లో సంస్థ ప్రారంభమైన తర్వాత, తమిళనాడు వెలుపల ఇంతటి భారీ స్థాయిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా కేవలం మోటార్‌సైకిళ్ల తయారీ మాత్రమే కాకుండా, ఒక భారీ వెండర్ పార్క్ కూడా అభివృద్ధి చెందనుంది. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు విడిభాగాలు సరఫరా చేసే అనుబంధ సంస్థలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలి రానున్నాయి. ఇది సత్యవేడును ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ క్లస్టర్‌గా మార్చనుంది.ఈ ప్లాంట్ ప్రారంభం కావడంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. దీంతో దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులలో కూడా సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు గ్రామంలో 233.76 ఎకరాలు, రాళ్ళకుప్పం గ్రామంలో 42.38 ఎకరాలు కలిపి మొత్తం 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు అనుబంధంగా ఉన్న సరఫరాదారులు, భాగాల తయారీ సంస్థలు కూడా ఏపీకి తరలివచ్చే అవకాశముంది. దీని ఫలితంగా సత్యవేడు ప్రాంతం భవిష్యత్తులో ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ తయారీ క్లస్టర్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రాజెక్టు తొలి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీర్ఘకాలిక పారిశ్రామిక వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కీలక ఫలితంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విస్తరణతో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులను కూడా గణనీయంగా పెంచుకోనుంది. "రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి గ్లోబల్ బ్రాండ్ ఏపీని ఎంచుకోవడం రాష్ట్ర వ్యాపార అనుకూల వాతావరణానికి నిదర్శనం. ఇది రాష్ట్రాన్ని అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతుంది" అని ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.దక్షిణ ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా మరో మెట్టు ఎక్కించే ఈ ప్రాజెక్టు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవనుంది. కియా మోటార్స్ తర్వాత ఆటోమొబైల్ రంగంలో ఏపీ సాధించిన మరో అతిపెద్ద విజయం ఇది. సత్యవేడు కేంద్రంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ చేసే ప్రయాణం ఏపీ పారిశ్రామిక భవిష్యత్తును సరికొత్త శిఖరాలకు చేరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

# పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం




**విజయవాడ – సూర్య వాస్తవం :**
స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలకు సంబంధించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలన్నది ఒక నిబంధన. ఇప్పుడు సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు వస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం వాటి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటికి సంబంధించి సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తో ముగిసింది. దీంతో సర్పంచులు మాజీలు అయ్యారు. వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇప్పటికే 16వ ఆర్థిక సంఘం సమయం ప్రారంభం అయింది. దాదాపు 15 వేల కోట్ల రూపాయల వరకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఈ నిధులు మంజూరయ్యేవి. అందుకే వీలైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి 16వ ఆర్థిక సంఘం నిధులతో.. పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్ల తో పాటు 123 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి పదవీకాలం మార్చి 17 తో ముగిసింది. ప్రస్తుతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో పట్టణాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అందుకే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. వార్డుల విభజనకు సంబంధించిన ప్రక్రియ కూడా జరుగుతోంది. ఇక మండల పరిషత్ తో పాటు జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించిన గడువు జూన్ వరకు ఉంది. మండల పరిషత్ అధ్యక్షులతోపాటు జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం జూన్ తో ముగియనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత జిల్లా పరిషత్ లది. అందుకే వీటి ఎన్నిక సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అనేక రకాల పిటిషన్లు కోర్టుల్లో దాఖలు అయ్యాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నాయి. అయితే బీసీ గణన తర్వాత రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాత్రం వేసవి తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఛాన్స్ కనిపిస్తోంది.

# హైదరాబాద్‌లో పెరుగుతున్న నేరాల రేటు

**హైదరాబాద్ – సూర్య వాస్తవం :**
దేశంలోని ప్రధాన నగరాలతో పోటీపడుతూ హైదరాబాద్‌లో నేరాల రేటు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన 2024 నివేదిక ప్రకారం, నగరంలో ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలు , చిన్నారులపై జరుగుతున్న అరాచకాలు పెరిగాయి.తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం, ఆన్‌లైన్ గేమింగ్, , వ్యసనాల కారణంగా చిన్నారులు నేరాల బాట పడుతున్నారు. ముఖ్యంగా 12-14 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలు చిన్న చిన్న దొంగతనాల నుండి హత్యలు, అరాచకాల వరకు పాల్పడుతుండటం గమనార్హం. 2023లో చట్టంతో విభేదించిన బాలల కేసులు 180 నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 316కు చేరింది.ఆర్థిక నేరాల విషయంలో ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో సామాన్యులు సైబర్ మాయగాళ్ల చేతిలో చిక్కి కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. సైబర్ నేరాల్లో నగరం దేశంలోనే మూడో స్థానంలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని బహిరంగ ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై వేధింపులు అధికమవుతున్నాయి. 2024లో నగరంలో 149 లైంగిక



వేధింపుల కేసులు, 358 అత్యాచార కేసులు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తల వ్యాప్తిలో కూడా హైదరాబాద్ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గమనార్హం.నేరాలు భారీగా నమోదవు తున్నప్పటికీ, వాటిపై ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో మాత్రం జాప్యం జరుగుతోందని నివేదిక పేర్కొంది. 2024లో నమోదైన మొత్తం నేరాల్లో కేవలం 56.9 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. పెరుగుతున్న ఈ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# అంగరంగ వైభవంగా నంబూరి రిషిత, హేమంత్ పెళ్లి వేడుక..

**అనంతపురం – సూర్య వాస్తవం :**
నంబూరి హరినాథ్ చౌదరి, రాధా గారి ఏకైక కుమార్తె వివాహ వేడుక అనంతపురం పట్టణంలోని స్థానిక కమ్మభవన్ లో అత్యంత ఘనంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఈ జంట వివాహ బంధంతో ఒకటయ్యారు. ఈ పెళ్లి వేడుకకు ఇరు కుటుంబాల పెద్దలు, సన్నిహితులు, స్నేహితులతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యంగా రాప్తాడు టిడిపి నాయకులు క్లస్టర్ ఇంచార్జి సోమరా నారాయణ స్వామి, సోమరా మోహన్, సోమరా రామప్ప, దామోదర్ హాజరై దంపతులను ఆశీర్వదించారు. సంప్రదాయ వేద పద్ధతిలో జరిగిన ఈ వివాహం ఎంతో ఘనంగా, ఆధ్యాత్మికత నిండుగా సాగింది.

# 483 ఫేక్ న్యూస్ కేసుల్లో ఏపీ టాప్

**విజయవాడ – సూర్య వాస్తవం :**2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా మొత్తం 483 ఫేక్ న్యూస్ కేసులు నమోదవగా.. అందులో 203 కేసులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. దీంతో ఫేక్ న్యూస్ కేసుల్లో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణలో 139 కేసులు నమోదయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కలిపి దేశవ్యాప్తంగా నమోదైన ఫేక్ న్యూస్ కేసుల్లో దాదాపు 70 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం. సోషల్ మీడియాలో రాజకీయ అంశాలపైనే కాకుండా మతపరమైన అంశాలు, సామాజిక వివాదాలు, సాధారణ ఘటనలపైనా తప్పుడు ప్రచారాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది. ఫేక్ పోస్టులు, మోర్ఫింగ్ వీడియోలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ఘటనలు అధికమయ్యాయని నేషనల్ క్రైం బ్యేరో రికార్డ్స్ పేర్కొంది.ఇక సైబర్ నేరాల విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2024లో రాష్ట్రంలో మొత్తం 2,528 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే సైబర్ నేరాలు 8 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ యాప్స్, సోషల్ మీడియా బ్లాక్‌మెయిలింగ్, డిజిటల్ ఫ్రాడ్స్ పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం నేరాల పరంగా కూడా ఏపీలో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు ఔఅఖీః గణాంకాలు చెబుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,16,076 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా హింసాత్మక నేరాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది.మహిళలపై నేరాల విషయంలో కూడా ఆంధ్రప్రదేశ్ టాప్ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే నేరాల్లో రాష్ట్రంలో 2,965 కేసులు నమోదయ్యాయి. మహిళల వేధింపుల కేసుల్లో దేశంలో మూడో స్థానంలో ఏపీ నిలవడం ఆందోళన కలిగిస్తోంది.మానవ అక్రమ రవాణా కేసుల్లోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో నిలిచినట్లు ఔఅఖీః పేర్కొంది. మరోవైపు 2024లో రాష్ట్రంలో మొత్తం 898 హత్య కేసులు నమోదయ్యాయి. అంటే సగటున రోజుకు రెండు నుంచి మూడు హత్యలు జరుగుతున్నట్లు ఔఅఖీః గణాంకాలు వెల్లడిస్తున్నాయి.రోడ్డు ప్రమాదాల విషయంలో కూడా ఏపీ దేశంలో 9వ స్థానంలో నిలిచింది. పెరుగుతున్న ప్రమాదాలు, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ప్రధాన కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ఔఅఖీః నివేదికతో రాష్ట్రంలో సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, హింసాత్మక ఘటనలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ఎన్నికల సమయంలో ఫేక్ ప్రచారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# గోల్డ్ థీఫ్ గ్యాంగ్ పనే...

**కరీంనగర్ – సూర్య వాస్తవం :**
కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు. గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం. వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది.దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం.కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి.గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )